# నమస్తే తెలంగాణ
## నాగర్‌కర్నూల్
3 మహబూబ్‌నగర్, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 NAGARKURNOOL


### నామినేషన్ల వెల్లువ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. రెండు ఎంపీ స్థానాలకు మొత్తం 76 నామపత్రాలు దాఖలయ్యాయి. మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌కు 42, నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌కు 36 మంది నామినేషన్లు వేశారు. చివరి రోజు పాలమూరులో 22, కందనూలులో 19 మంది నామినేషన్లు రిటర్నింగ్ అధికారులకు అందించారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌తో కలిసి నామినేషన్ వేశారు.





- సాయంత్రం జడ్చర్ల నుంచి బస్సు యాత్ర
- మహబూబ్‌నగర్ వరకు భారీ రోడ్‌షో
- క్లాక్ టవర్ వద్ద కార్నర్ మీటింగ్
- రాత్రికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో బస
- ఉమ్మడి జిల్లా నేతలతో సమాలోచనలు
- రేపు నాగర్‌కర్నూల్‌లో..
- భారీగా తరలిరానున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# పాలమూరులో పోరుబాట

## నేడే గులాబీ బాస్ కేసీఆర్ రాక

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరులో వలసలు, కరువు రక్కసిని పారద్రోలి.. పార్లమెంటు సభ్యుడిగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు పాలించిన పాలనా దక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజులపాటు రోడ్ షోలో పాల్గొననున్నారు. పార్లమెంట్ ఎన్నికల రణరంగం షురూ అయిన నేపథ్యంలో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించబోతున్నారు. శుక్ర, శనివారాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఉండి రైతుల గోసను ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. కేసీఆర్ చేపట్టబోయే రోడ్ షోకు పార్టీ నేతలు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ ఎంపీ, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు కలిసి భారీ ఎత్తున జన సమీకరణ చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో పార్టీ అధినేత టూర్‌ను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, పార్టీ నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి అధినేత రోడ్ షోలకు భారీ ఎత్తున జన సమీకరణను చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో రోడ్ షోలను విజయవంతం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో కేసీఆర్ రెండ్రోజుల పర్యటన రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం, ఎలాగైనా పార్లమెంట్ స్థానాన్ని గెలవాలని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈక్రమంలో కేసీఆర్ పాలమూరులో అడుగుపెడు తుండడంతో పొలిటికల్ హీట్ పెరిగింది. బీఆర్‌ఎస్ అధినేత టూర్ కాంగ్రెస్, బీజేపీలో ఉత్కంఠను రేపుతున్నది.

### గులాబీమయమైన పాలమూరు..

కేసీఆర్ రోడ్ షో నేపథ్యంలో పాలమూరు పట్టణం గులాబీమయమైంది. పార్టీ నేతలు చౌరస్తాల వద్ద బ్యానర్లు, ఫ్లెక్సీలతోపాటు గులాబీ జెండాలను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధి ప్రారంభమయ్యే షాద్‌నగర్ మొదలుకొని మహబూబ్‌నగర్ వరకు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా జాతీయ రహదారి పొడవునా ఉద్యమ నేతకు నీరాజనం పలికేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

### జడ్చర్ల మీదుగా పాలమూరుకు..

కేసీఆర్ బస్సు యాత్ర జడ్చర్ల నుంచి మొదలవుతుంది. పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి కేసీఆర్‌కు స్వాగతం పలుకనున్నారు. అక్కడ నుంచి అభివాదం చేస్తూ భారీ ర్యాలీతో మహబూబ్‌నగర్‌లో అడుగుపెట్టనున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోగానే లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన జనం కేసీఆర్ రోడ్ షోలో పాల్గొంటారు.

### క్లాక్ టవర్ వద్ద కార్నర్ మీటింగ్..

భారీ ర్యాలీతో అప్పనపల్లి, ఏనుగొండ, శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీ, మెట్టుగడ్డ, న్యూటౌన్ బస్టాండ్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా కేసీఆర్ రోడ్ షో సాగుతుంది. అక్కడి నుంచి బస్సులో క్లాక్ టవర్‌కు చేరుకొని అక్కడ బీఆర్‌ఎస్ అధినేత జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

### మాజీ మంత్రి నివాసంలో రాత్రి బస..

మహబూబ్‌నగర్‌లో రోడ్ షో, కార్నర్ మీటింగ్ అనంతరం రాత్రికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో కేసీఆర్ బస చేస్తారు. ఇక్కడే పార్టీ నాయకులతో కలిసి ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లో గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై సమీక్షిస్తారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వర్గాల ప్రజలతో కేసీఆర్ కలిసి మాట్లాడనున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా పాలమూరును వలస నుంచి విముక్తి చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోని వలస పోయే దుస్థితికి తీసుకొచ్చింది. కరెంటు కోతల వల్ల పంటలు ఎండిపోవడంతో కుంగిన అన్నదాతలతో కేసీఆర్ మాట్లాడనున్నారు. తిరిగి సాయంత్రం నాగర్‌కర్నూల్‌కు బయలుదేరుతారు. కేసీఆర్ రోడ్ షోలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలు

# వందరోజుల్లోనే సర్కారు ఫ్లాప్

- ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హామీల అమలులో విఫలం : ఎంపీ మన్నె
- ఆరు గ్యారెంటీలు అమలు కావని అర్థమైంది : మాజీ ఎమ్మెల్యేలు
- పాలమూరులో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ లేదని.. వంద రోజుల్లోనే వారి పాలన ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. గురువారం మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. మీడియాతో మాట్లాడిన అనంతరం మహబూబ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడారు. సాగునీరు లేక పంటలు ఎండి రైతులు అప్పుల ఊబిలో కురుకుపోయారన్నారు. కాంగ్రెస్ హయాంలో మహిళలు నీళ్ల కోసం బిందెలతో బయటికొచ్చే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించిన నాటి నుంచి మహిళలు చేయి ఎత్తితే బస్సులు నిలిపే పరిస్థితి పోయిందన్నారు. గ్రామాలు, పట్టణ ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఓటమికి బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై అసత్య ప్రచారాలు చేశాయని ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తే మహబూబ్‌నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరెంటు కోతలతో పరిశ్రమలు మాతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, తాను ఎంపీగా ఉన్నప్పుడు రాష్ట్రానికి రావాల్సిన వాటాను పోరాడి తీసుకొచ్చానని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీలు అమలుకావని ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గ్యారెంటీలపై మంత్రులు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం పదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందని, ఇప్పుడు కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురావడంతోపాటు రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిచేసుకుంటూ పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పదేళ్ల పాలన ఎట్లా ఉండే.. వంద రోజుల కాంగ్రెస్ పాలన ఎట్లుందో ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, కొరమోని వెంకటయ్య, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



- జాతీయ పార్టీలకు ఓటేస్తే మళ్లీ చీకట్లోకే..
- మరోసారి ఆశీర్వదించండి
- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- పాలమూరు ప్రజలు మరోసారి మోసపోవద్దు
- మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్ రెడ్డి
- హస్తం పార్టీది నీచమైన పాలన
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మక్తల్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

### సర్కారు తీరును ఎండగడుతాం : మన్నె

అధికార దాహంతో అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడేమో వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నది. ఆ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణలో 2014కు ముందు రోజులు వచ్చాయన్నారు. 65 ఏండ్లు దేశాన్ని ఎలా పాలించారో.. ఇప్పుడు కూడా తెలంగాణలో అలాగే ఉన్నది. కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలొస్తాయని చెప్పినట్టుగానే జరుగుతున్నది. రైతాంగం కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా మిగతా వాటిని సీఎం రేవంత్‌రెడ్డి గాలికొదిలేశారు. ఎన్నికల వేళ రైతుల కోసం ఉంచిన రూ.7,500కోట్ల రైతుబంధు నిధుల్ని తన ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులకు పంచిన ఘనత రేవంత్‌కే దక్కింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేస్తే మళ్లీ మనం చీకట్లోకి వెళ్లాల్సిందే. ఎంపీ అభ్యర్థిగా నిలిచిన నన్ను మరోసారి ఆశీర్వదిస్తే జిల్లా అభివృదితోపాటు కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టేందుకు పార్లమెంట్‌లో పాలమూరు గళాన్ని వినిపిస్తా. బీజేపీ అక్షింతలను పంచుతూ ప్రచారం చేస్తోంది. ఆ పార్టీపై మాట్లాడితే నాపై కూడా ఈడీ, ఐటీ దాడులు నిర్వహించేందుకు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉంటారు. చిన్న చిన్న పొరపాట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయాం. ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధించి కాంగ్రెస్ నిరంకుశ పాలనను ఎండగడుతాం. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటేసి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా.

### ప్రజలకు సర్కారు మోసం : రాజేందర్‌రెడ్డి



అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌పై లేనిపోని అబద్ధపు మాటలు చెప్పి రేవంత్ ప్రజలను మోసం చేశారు. కేసీఆర్ వస్తే ఎకరాకు రూ.పదివేల రైతుబంధు.. కాంగ్రెస్ వస్తే ఎకరాకు రూ.15వేలు అని చెప్పి మోసపూరిత హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టాక రైతుబంధు వేయకుండా రైతులను గోసపెడుతున్నది. డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. నాలుగు నెలలవుతున్నా ఎలాంటి చర్యలు లేవు. పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ ప్రజలను మోసం చేయాలనే లక్ష్యంతోనే ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు. పాలమూరు ప్రజలు కాంగ్రెస్ హామీలకు మరోసారి మోసపోకుండా మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో మరోసారి గెలిపించాలి.



మక్తల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

# విజయం మనదే..

మక్తల్ టౌన్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన పట్టణంలోని వట్టం రవి కన్వెన్షన్ హాల్లో గురువారం మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం హాజరయ్యారు.



### అవగాహన లేని రేవంత్‌రెడ్డి: చిట్టెం

నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా. పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రతి కార్యకర్తను ఆదరించాం. పదేండ్లు పందికొక్కుల్లా తిన్న కొందరు అధికార దాహంతో తల్లి లాంటి బీఆర్‌ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారు. అటువంటి వారిని మేము ఆపము. క్లిష్ట పరిస్థితుల్లో పార్టీని వీడిన వారంతా అవకాశవాదులే. వాళ్లు మళ్లీ పార్టీలోకి వస్తామంటే కచ్చితంగా రానివ్వం. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ నీచమైన పరిపాలనను కొనసాగిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి సాగునీటిపై ఎలాంటి అవగాహన లేకపోవడం వల్లనే మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్‌కు పైప్ లైన్ ద్వారా నీటిని తీసుకెళ్తానని చెబుతున్నడు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే సహించం. హామీలను నెరవేర్చకుండా కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటిని తరలిస్తామని చెబుతూ ప్రజలను మరోసారి మోసం చేస్తున్నరు. ఎన్నికల వేళ కేసీఆర్ ప్రభుత్వం రూ.7,500 కోట్ల రైతుబంధు నిధులను ట్రెజరీలో ఉంచితే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రుల ఖాతాల్లో జమ చేసిన అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పతనం ఖాయం. ఆ వెంటనే రేవంత్‌రెడ్డి పోస్ట్ కూడా ఖాళీ అవుతుంది. శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# రోడ్‌షోను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గులాబీ దళపతి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రోడ్‌ను విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సూచించారు. ఈమేరకు గురువారం ఆయన నాగర్‌కర్నూల్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో చర్చించారు. తొలి తెలంగాణ ప్రభుత్వంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి ప్రతి ఇంటికి చేరవేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పల్లెల్లో పార్టీకి పట్టుకొమ్మలు కార్యకర్తలే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా రోడ్‌షో నిర్వహిస్తున్నారని, మన పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తున్న అధినేతకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రవీణ్‌కుమార్‌కు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి మెజార్టీ ఓట్లు వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రోడ్‌షోకు పట్టణంలోని నాయకులు, కార్యకర్తలకు కార్యక్రమం విజయవంతం చేసేందుకు దిశానిర్ధేశం చేశారు. నాగర్‌కర్నూల్ పట్టణం నుండి పెద్ద ఎత్తున పట్టణ వాసులు పాల్గొనే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పలువురు పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అచ్చంపేటకు సీఎం ఏం చేసిండు?

- ఇక్కడి ఎమ్మెల్యే అసమర్థుడు
- నల్లమల ప్రజల గొంతుకను ఢిల్లీలో వినిపిస్తా
- ఆదరించండి.. అభివృద్ధి చేస్తా
- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీ
- జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి: గులాబీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



మద్దిమడుగులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌పీ, గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఏప్రిల్ 25 : తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే నల్లమల ప్రజల గొంతుకను ఢిల్లీలో వినిపిస్తానని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన బీఆర్‌ఎస్ కందనూలు జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి పదర, అమ్రాబాద్ మండలాల్లో ప్రచారం నిర్వహించారు. పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల అనంతరం మద్దిమడుగు, అనంతరం ఇప్పలపల్లి, మారడుగు, ఉడిమిళ్ల, పెట్రాల్‌చేను, వంకేశ్వరం, పదర, కుమ్మరోనిపల్లి, మాధవానిపల్లి, అమ్రాబాద్, మాచారం, మన్ననూర్‌లో ప్రచారం నిర్వహించగా ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా వారికి స్వాగతం పలికారు. మద్దిమడుగులో ఇంటింటి ప్రచారం చేయగా కాంగ్రెస్ వచ్చినంక తమ బతుకులు ఆగమయ్యాయని గ్రామస్తులు వాపోయారు. ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ గతంలో ఎంపీలుగా గెలిచిన వాళ్లు ఆలయంతోపాటు మద్దిమడుగు, ఇప్పలపల్లి ప్రజల అభివృద్ధి గురించి పార్లమెంట్‌లో ఏనాడైన ప్రసంగించారా అని ప్రశ్నించారు. పక్కనే కృష్ణమ్మ పారుతున్నా తాగునీటికి నోచుకోని దుస్థితి నెలకొన్నదన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ అసమర్థుడని, ఆయన వల్ల ఏదీకాదన్నారు. ఈ ప్రాంతవాసిగా చెప్పుకొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి అచ్చంపేటకు ఏంచేశాడని ప్రశ్నించారు. స్థానిక అభ్యర్థులు లేనట్టుగా ఖమ్మం జిల్లాకు చెందిన మల్లు రవిని కాంగ్రెస్ ఇక్కడ అభ్యర్థిగా నిలబెట్టి మన ప్రాంతాన్ని అవమానించిందన్నారు. తాను ఇక్కడే పుట్టి పెరిగానని, తనను ఆదరించి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో నల్లమల ప్రజల గొంతుకనవుతానన్నారు. కులం పేరు చెప్పుకొని రాజకీయం చేయొద్దని, ప్రజల బాగోగుల గురించి ఆలోచించాలని సూచించారు. చరిత్రను మార్చగలిగే సత్తా, విజన్ తనకుందన్నారు. పేదలకు సేవ చేసేందుకే రాజకీయంలోకి వచ్చానని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

### కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

మరోసారి అచ్చంపేట ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధిచెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. ఈ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ దోచుకునేందుకు చూస్తున్నదని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటున్న బీజేపీకి, కాంగ్రెస్ పార్టీ రహస్యంగా వంతపాడుతున్నదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డివి గాలిమాటలని ప్రజలకు ఎప్పుడో అర్థమైందన్నారు. గ్రామాల్లో ప్రచారానికి చ్చే హస్తం పార్టీ నాయకులను ఎక్కడిక్కడ నిలదీయాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ సమన్వయ కర్త నవీన్‌కుమార్‌రెడ్డి జెడ్పీటీసీ రాంబాబు, వైఎస్ ఎంపీపీ వరుణ్, ఎంపీటీసీ సునీతా శ్రీను, సింగిల్‌విండో డైరెక్టర్లు, నాయకులు కోటిరెడ్డి, తార్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌పీ

# రేవంత్‌ది కపట ప్రేమ

- అచ్చంపేట రోడ్ షోలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- ఆర్‌ఎస్‌పీని పార్లమెంట్‌కు పంపుదాం
- బీఆర్‌ఎస్ కందనూలు జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 25 : రాష్ట్రంపై సీఎం రేవంత్‌రెడ్డి కపట ప్రేమ చూపుతున్నాడని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అచ్చంపేటలో గురువారం నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్‌ఎస్ కందనూలు జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో నమ్మించి అధికారంలోకి వచ్చాక అమలును విస్మరించిందన్నారు. ప్రజలు ప్రస్తుతం నిరాశతో ఉన్నారని.. ప్రతి ఊరి ప్రజలు తనతో మాట్లాడారని తెలిపారు. అన్ని వర్గాల వారిని మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బీజేపీ అభ్యర్థి భరత్‌కు అప్పట్లో జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వలేదని రెండునెలలు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఎలా పనిచేస్తాడని ప్రశ్నించారు. గువ్వల బాలరాజు అచ్చంపేటలో వంద పడకల దవాఖాన కట్టించాడని, నియోజకవర్గాన్ని ఏంతో అభివృద్ధి చేశాడన్నారు. అనంతరం గువ్వల మాట్లాడుతూ దొంగమాటలు చెప్పే వారికి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి ఆర్‌ఎస్‌పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన ప్రజలు

# గులాబీదండు కదిలిరావాలి

- బీఆర్‌ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 25 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఉద్యమనేత కేసీఆర్ శుక్రవారం మహబూబ్‌నగర్‌లో రోడ్ షో చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి గులాబీ దండు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. శుక్రవారం మధ్యాహ్నం జడ్చర్ల నుంచి పాలమూరుకు కేసీఆర్ బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. పేటలోని 13 మండలాల నుంచి గులాబీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్, అభిమానులు మధ్యాహ్నం 3:30 గంటల వరకు మహబూబ్‌నగర్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి చేతిలో మెసపోయిన (కల్యాణలక్ష్మితోతులం బంగారం అందని మహిళలు, మహాలక్ష్మి పథకంలో నెలకు రూ.2,500 అందుకోని వారు.. రైతుబంధు జమ కాని రైతులు.. ఇందిరమ్మ ఇండ్లు అందుకోని వారు.. రూ.2లక్షల రుణమాఫీ అందని రైతులు.. 2లక్షల ఉద్యోగాలు అందుకోని యువకులు, రూ.4 వేల పింఛన్ పొదని ఆసరా పింఛన్‌దారులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందుకోని వారు, రూ.500 సిలిండర్ అందుకోని) వారు హాజరై కేసీఆర్ వద్ద తమ గోస వెలిబుచ్చుకోవాలని కోరారు.